క్లుప్తంగా

నేడు విద్యుత్ అంతరాయం

చిత్తూరు కార్పొరేషన్: ట్రాన్స్‌కో అర్బన్ డివిజన్ పరిధిలో శనివారం విద్యుత్ లైన్ల నిర్వహణ పనులు చేయనున్నారు. ఈ మేరకు పలు ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఈఈ మునిచంద్ర తెలిపారు. చిత్తూరు నగరం, గుడిపాల, చిత్తూరు రూరల్, యాదమరి, బంగారుపాళ్యం, ఐరాల, తవణంపల్లె మండలాల్లో విద్యుత్ ఉండదన్నారు. వినియోగదారులు మార్పును గమనించి సహకరించాలని వివరించారు.

చిత్తూరులో జాతర ఏర్పాట్ల తనిఖీ


ఏర్పాట్లు పరిశీలిస్తున్న కమిషనర్

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలో ఈనెల 13, 14 తేదీల్లో నిర్వహించనున్న గంగ జాతర నేపథ్యంలో కార్పొరేషన్ అధికారులు ఏర్పాట్లపై తనిఖీలు నిర్వహించారు. మునిసిపల్ కమిషనర్ నరసింహప్రసాద్ శుక్రవారం బజారువీధి, గిరింపేట, సంతపేట, మురకంబట్టు, పాంచాలపురం, కొంగారెడ్డిపల్లె, కట్టమంచి, దొడ్డిపల్లెలోని గంగమ్మను ప్రతిష్టించే ప్రాంతాల్లో జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. భక్తుల సౌకర్యాలు, పారిశుద్ధ్య పనులపై అధికారులకు సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఎక్కడా కూడా ప్రజలకు ఇబ్బందులు లేకుండా అమ్మవారి దర్శనం కల్పించడం, పారిశుద్ధ్య పనులు చేపట్టాలని ఆదేశించారు. కమిషనర్ వెంట ప్రజారోగ్యశాఖ అధికారి డా.లోకేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, మేస్త్రీలు ఉన్నారు.

రాయితీ రుణాలకు 220 దరఖాస్తులు

తవణంపల్లె: ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రాయితీ రుణాల కోసం మండలంలో ఆన్‌లైన్‌లో 220 దరఖాస్తులు వచ్చినట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ రాఘవేంద్రరాజు తెలిపారు. మండలంలోని 32 పంచాయతీలకు 32 యూనిట్లు మంజూరైనట్లు వెల్లడించారు. ఈ నెల 10వ తేదీ శనివారం సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. తర్వాత వచ్చే దరఖాస్తులను తిరస్కరిస్తామని వివరించారు. ఆసక్తి కలిగిన ఎస్సీ నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సాంకేతిక పరిజ్ఞానంతో అధిక దిగుబడులు


అవగాహన కల్పిస్తున్న ట్రైనర్ హేమంత్

ఐరాల: వ్యవసాయంలో సాంకేతిక పరిజ్ఞానం ద్వారా రైతులు అధిక దిగుబడులు సాధించవచ్చని మండల పర్యవేక్షక అధికారి రజనీకుమారి సూచించారు. మండలంలోని కామినాయనపల్లె రైతు సేవా కేంద్రంలో శుక్రవారం రైతులకు ఆమె ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పంటల సాగులో రైతులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంచుకొని అధిక ఆదాయ మార్గాలను పెంపొందించుకోవాలని తెలిపారు. ప్రతి రైతు తమ స్మార్ట్ ఫోన్లలో వ్యవసాయ శాఖకు సంబంధించిన యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకుని తద్వారా నూతన సాగు విధానాలపై పూర్తి అవగాహనతో మెలగాలని తెలియజేశారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ బంగారమ్మ, మాస్టర్ ట్రైనర్ హేమంత్, వీహెచ్ఏ రామచైతన్య పాల్గొన్నారు.

పట్టాలపై సర్వే చేయించండి

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలోని అనుప్పల్లెలో పేదలకు మంజూరు చేసిన దాదాపు 90 ఇళ్ల పట్టాలపై సర్వే చేయించాలని సీపీఐ నాయకులు నాగరాజు, మణి కోరారు. ఈ మేరకు శుక్రవారం ఎమ్మెల్యే నిర్వహించిన ప్రజాదర్బార్‌లో గురజాల జగన్మోహన్‌కు వినతిపత్రం అందజేశారు. ఇక్కడి లే-అవుట్‌లో రెవెన్యూ అధికారులచేత సర్వే చేయించి, నిజమైన లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు చెందేలా చర్యలు తీసుకోవాలన్నారు. చిత్తూరు నియోజకవర్గంలో వైద్య కళాశాల, యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని చిత్తూరు స్మార్ట్ సిటీ డెవలప్‌మెంట్ సొసైటీ నేతలు తాండవమూర్తి, గోపినాయక్, సత్య తదితరులు కోరారు. ఎమ్మెల్యేకు వినతిపత్రం అందచేసి, వీలైనంత త్వరగా ఇవి కార్యరూపం దాల్చడానికి చొరవ చూపాలని కోరారు.

అమర వీరుడికి నివాళి



బంగారుపాళెం: పాక్ కాల్పుల్లో వీరమరణం పొందిన జవాన్ మురళీనాయక్‌కు శుక్రవారం రాత్రి మండల కేంద్రంలో నివాళులర్పించారు. సత్యసాయి జిల్లా గోరంట్ల మండలం కళ్లితాండకు చెందిన ఆర్మీజవాన్ మురళీనాయక్ పాక్ కాల్పుల్లో వీరమరణం పొందారు. దీంతో పలువురు ఉపాధ్యాయులు, యువకులు, స్థానికులు ప్రభుత్వ ఉన్నత పాఠశాల సమీపంలోని కార్గిల్ అమరవీరుల స్మారక స్థూపం వద్ద అమరజవాన్ చిత్రపటాన్ని ఏర్పాటు చేసి వెలుగుతున్న క్యాండిల్స్‌తో నివాళులర్పించారు. జోహార్ వీరజవాన్ మురళీనాయక్, భారతమాతాకీ జై అంటూ నినాదాలు చేశారు. ఉపాధ్యాయులు మాట్లాడుతూ, దేశరక్షణలో అసువులుబాసిన మురళీనాయక్ పోరాటం ఆదర్శమని కొనియాడారు. దేశరక్షణలో యువత భాగస్వాములు కావాలన్నారు. మురళీనాయక్ త్యాగాన్ని మురువలేనిదన్నారు. కార్యక్రమంలో పలురువు స్థానికులు పాల్గొన్నారు.


వీరజవాన్ మురళీనాయక్‌కు నివాళులర్పిస్తున్న స్థానికులు

మండే సూరీడుతో షాక్

- లోడు ఎక్కువైతే వైర్లు కాలిపోయే అవకాశం
- షార్ట్ సర్క్యూట్‌తో గృహోపకరణాలకు ముప్పు
- వైరింగ్‌లో ప్రమాణాల అవసరం
- సరఫరాలో లోపాలుంటే ఫిర్యాదు చేయాలి


షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగుతున్న దృశ్యం

బంగారుపాళెం: వేసవి వచ్చేసింది. ఎండలు అంతకంతకూ ముదురుతున్నాయి. ఉష్ణోగ్రతలు 35-40 డిగ్రీల వరకూ నమోదవుతున్నాయి. ఉక్కపోత నుంచి ఉపశమనానికి విద్యుత్ ఉపకరణాల వినియోగం మూడింతలవుతోంది. ఇక్కడ వరకు బాగానే ఉన్నా విద్యుత్ వైర్ల సామర్థ్యంపైనే సందేహాలన్నీ. ఇన్‌సీల్డ్ వైరింగా..గోడలపైనే గొట్టాల్లో ఏర్పాటు చేశారా..సరైన ప్రమాణాలతో తగిన మందం ఉన్న వైర్లు వేశారా అనేది అందరూ గుర్తించాల్సిన అంశం. ఏదైనా లోపాలుంటే విద్యుత్ షార్ట్ సర్క్యూట్ అయ్యే ప్రమాదం పొంచి ఉందన్న విషయాన్ని గుర్తించుకోవాలి. ఈ నెలాఖరు నాటికి ఉష్ణోగ్రతలు అధికంగా పెరిగే అవకాశం ఉందని వాతావరణశాఖ చెబుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో జాగ్రత్తలతో పాటు అప్రమత్తత ఎంతో అవసరం ఉంది.

ఇలా చేయవద్దు.

- గృహంలో 15 యాంప్స్ విద్యుత్ ఉపయోగించే చోట 30 యాంప్స్ భారం పడే పరికరాలు ఉపయోగిస్తే తీగలు కాలిపోయే ప్రమాదం ఉంది.
- ఒకే స్విచ్ బోర్డుకు ఎక్కువ ప్లగ్‌లు ఉపయోగిస్తే ఒక్కసారిగా లోడ్ పెరిగి స్పార్క్ వచ్చి ప్రమాదాలకు అవకాశం ఉంటుంది.
- ఎండలో విద్యుత్ తీగలు ఉంచితే భవిష్యత్‌లో తీగలపై ఉన్న రబ్బరు మెత్తబడి ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుంది.
- ఇంటిలో ఒకేసారి విద్యుత్ ఉపకరణాలన్నీ ఆన్ చేసి ఉంచవద్దు.
- కంప్యూటర్ పరికరాలు, టీవీల వద్ద విద్యుత్ తీగలను చిందర వందరగా ఉంచవద్దు
- రక్షణ పరికరాలైన ఎంసీబీ(కరంట్ కంట్రోలర్ బ్రేకర్)ఫీజులను బైపాస్ చేయకూడదు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- వేసవికాలం ప్రారంభమయ్యే ముందు తప్పనిసరిగా ప్రతి ఒక్కరూ ఇళ్లు, కార్యాలయాలను తప్పనిసరిగా ప్రైవేట్ ఎలక్ట్రీషియన్లతో తీగల వ్యవస్థను తనిఖీ చేయించుకోవాలి.
- విద్యుత్ వైరింగ్ చేయించేటప్పుడు పూర్తిగా ఐఎస్ఐ, బీఐఎస్ మార్క్ కలిగిన విద్యుత్ పరికరాలను మాత్రమే ఉపయోగించాలి.
- ఇంట్లో విద్యుత్ వినియోగం అధారంగా విద్యుత్‌శాఖ నుంచి లోడ్‌ను తీసుకోవాలి.
- అందుకు తగినట్లుగా వైరింగ్ ఏర్పాటు చేసుకున్న తరువాత ఏసీలు, కూలర్లు, వాటర్ హీటర్లు, మైక్రోఓవెన్ ఇతర ఎలక్ట్రికల్ వస్తువులు వినియోగించుకోవాలి.
- ఎలక్ట్రానిక్ ఉపకరణాన్ని బట్టి దానికి అనుగుణంగా నాణ్యత కలిగిన విద్యుత్ తీగలను వినియోగించాలి.
- నాసిరకం విద్యుత్ పరికరాలతో విద్యుత్ వృథా కావడంతో పాటు ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున వైరింగ్ మరింత పటిష్టంగా ఉండేలా చూసుకోవాలి.
- గృహాలు, వాణిజ్య సంస్థలు, కార్యాలయాల్లో తప్పని సరిగా న్యూట్రల్ పరికరాల కోసం సరిపడేంత ఎర్త్ ఎలక్ట్రోడ్ ఏర్పాటు చేసుకోవాలి.
- ఎండాకాలంలో రక్షణ పరికరాలు సరిగ్గా పని చేయాలంటే ఎర్తింగ్ సరైన పద్ధతిలో ఉండేందుకు అవసరమైన ప్రదేశంలో నీరు, రాళ్ల ఉప్పు ఉపయోగించాలి.
- విద్యుత్ ఉపకరణాలకు మూడు పిన్నుల ప్లగ్‌లు, సాకెట్లు మాత్రమే ఉపయోగించాలి.
- విద్యుత్ స్తంభాల నుంచి మీటర్ వరకు ఉండే సర్వీస్ వైర్లు అతుకుల్లేకుండా చూసుకోవాలి.
- సింగిల్ ఫ్యూజ్ సర్క్యూట్‌లో ఫ్యూజ్, న్యూట్రల్ ఎర్త్ వైర్లు సమాన పరిమాణంలో ఉండేలా చూసుకోవాలి
- ఏసీలు, ఫ్రిజ్‌లు, టీవీలు ఇతర విద్యుత్ ఉపకరణాలు వాడే సమయంలో కచ్చితంగా స్టెబిలైజర్లను వినియోగించాలి. విద్యుత్ సరఫరాలో హెచ్చు తగ్గులు వస్తుంటే వెంటనే సంబంధిత విద్యుత్‌శాఖ సిబ్బందికి ఫిర్యాదు చేయాలి. లేకుంటే సమీప ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయే ప్రమాదముంది.

అప్రమత్తంగా ఉండాలి

వేసవికాలంలో విద్యుత్ తీగలు వ్యాకోచం చెందే అవకాశం ఉన్నందున షార్ట్ సర్క్యూట్ జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. గృహాల్లో వినియోగించే విద్యుత్ ఉపకరణాలకు అనుగుణంగా ప్రత్యేకంగా వైరింగ్‌ను చేయించుకోవాలి. విద్యుత్ సరఫరాల్లో లోపాలుంటే వెంటనే సమీప లైన్‌మన్‌కు తెలియజేసి సరిచేసుకోవాలి.

- లక్ష్మీప్రియ, ట్రాన్స్‌కో టౌన్ ఏఈ

అధిక లోడుతో అనర్థమే

వేసవిలో విరివిగా విద్యుత్ ఉపకరణాల వినియోగం వల్ల ఒక్కొక్కసారి సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతుంటాయి. గృహాల్లో కానీ, కార్యాలయాల్లో కానీ వాడుతున్న విద్యుత్ వాడకాన్ని బట్టి లోడ్‌ను నిర్ధారించుకుని ఆ మేరకు విద్యుత్‌శాఖ నుంచి అనుమతి తీసుకోవాలి. దీంతో విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి వినియోగదారునికి అవసరమైన లోడ్‌ను ఆ ట్రాన్స్‌ఫార్మర్‌లో అందుబాటులో ఉంచుతుంది. ఎవరైనా వినియోగదారులు 1 కేవీ లోడును మాత్రమే అనుమతి పొంది వేసవి తీవ్రత దృష్ట్యా అధికంగా విద్యుత్‌ను వినియోగిస్తే ఆ ప్రభావం సమీప ట్రాన్స్‌ఫార్మర్‌పై పడి తీవ్రంగా దెబ్బతినే అవకాశం ఉంది. ఒక్కోసారి షార్ట్ సర్క్యూట్ కారణంగా కాలిపోయే అవకాశం ఉంటుంది. వినియోగదారులందరూ వాడుతున్న లోడ్‌కు అనుగుణంగా అనుమతి పొందితే విద్యుత్ ప్రమాదాలు సంభవించే అవకాశం తక్కువగా ఉంటుందని విద్యుత్ రంగ నిపుణులు చెబుతున్నారు.

హెచ్ఐవీపై అవగాహన కల్పించాలి


బంగారుపాళెంలో ఐసీటీసీలో రికార్డులు పరిశీలిస్తున్న కోటిరెడ్డి

బంగారుపాళెం: ప్రజలకు హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన కల్పించాలని క్లస్టర్ ప్రోగ్రాం జిల్లా మేనేజర్ కోటిరెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ఇంటిగ్రేటెడ్ కౌన్సెలింగ్ అండ్ టెస్టింగ్ సెంటర్(ఐసీటీసీ)ను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. కేంద్రంలోని రికార్డులను పరిశీలించారు. ఐసీటీసీలో రోజుకు ఎంతమంది హెచ్ఐవీ పరీక్షలు చేసుకునేందుకు వస్తున్నారని కౌన్సిలర్ బాబును అడిగి తెలుసుకున్నారు. అనంతరం ల్యాబ్‌ను సందర్శించి స్టాక్స్, కిట్స్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ, ప్రజలకు హెచ్ఐవీ ఎయిడ్స్‌పై చైతన్యం కలిగించే కార్యక్రమాలను చేపట్టాలన్నారు. గర్భిణులకు తప్పనిసరిగా హెచ్ఐవీ పరీక్షలు చేసుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శిరీషా, ల్యాబ్ టెక్నీషియన్లు జయచంద్ర, భువన, సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు శిక్షణ


రైతులకు వ్యవసాయంపై డిజిటల్ శిక్షణ ఇస్తున్నట్లు వ్యవసాయశాఖ ఏడీఏ ఉమ తెలిపారు. రామభద్రాపురం, పానాటూరు రైతు సేవా కేంద్రంలో శుక్రవారం రైతులకు వ్యవసాయంలో డిజిటల్ శిక్షణపై ఆమె అవగాహన కల్పించారు. - గుడిపాల

విధిగా రక్త పరీక్షలు చేయించుకోవాలి


గర్భిణికి వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ పూర్ణలత

ఐరాల: గర్భిణులు ప్రతి నెలా క్రమం తప్పకుండా రక్త పరీక్షలు చేయించుకోవాలని స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ పూర్ణలత సూచించారు. పీహెచ్‌సీలో శుక్రవారం డాక్టర్ ప్రధానమంత్రి సురక్షిత్ మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా 40 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేసి, తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఆమె మాట్లాడుతూ గర్భిణులు ఐరన్, క్యాల్షియం, విటమిన్లు కలిగిన ఆహారాన్ని ఎక్కువగా తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందన్నారు. ఆకు కూరలు, గుడ్లు, పాలు తదితర పౌష్టికాహారం తీసుకుంటే మాతాశిశు మరణాలు తగ్గించవచ్చన్నారు. ఆశావర్కర్లు గర్భిణులు ప్రసవం అయ్యే వరకు వారికి సహాయంగా ఉండాలని సూచించారు. ప్రతి నెలా తొమ్మిదో పీహెచ్‌సీలో గర్భిణులకు అందించే వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రభుత్వాస్పత్రిలోనే ప్రసవం చేయించుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో సీహెచ్ఓ ఆదిలక్ష్మి, పీహెచ్ఎన్ జీవకళ, హెల్త్ సూపర్‌వైజర్ చిన్నమ్మ, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

హైరిస్క్ గర్భిణులకు స్క్రీనింగ్ పరీక్షలు


స్క్రీనింగ్ పరీక్ష చేస్తున్న డాక్టర్ ప్రియాంక

తవణంపల్లె: ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో హైరిస్క్ గర్భిణులకు స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. మండల వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక మండలంలోని 35 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు చేశారు. అనంతరం గర్భంలో బిడ్డ కదలికలు, ఆరోగ్య స్థితిగతులు తెలుసుకోవడానికి స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. హైరిస్క్ గర్భినులు ఐరన్ మాత్రలు తప్పక వాడాలన్నారు. మంచి పౌష్టికాహారం, తాజా కూరగాయలు, ఆకుకూరలు భుజించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇచ్చే పౌష్టికాహారం తప్పకుండా తినాలని పేర్కొన్నారు. ప్రతి నెలా విధిగా పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ రెడ్డెమ్మ, ఏఎన్ఎంలు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

గర్భిణులు ఆరోగ్య సూత్రాలు తప్పక పాటించాలి

తవణంపల్లె: గర్భవతులు ఆరోగ్య సూత్రాలు తప్పక పాటించాలని డాక్టర్ కేశవనారాయణ అన్నారు. మండలంలోని దిగువ తడకరలో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ కేశవనారాయణ మాట్లాడుతూ గర్భిణులు మంచి పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. రక్తహీనత రాకుండా ఐరన్ మాత్రలు వాడాలన్నారు. అనంతరం గర్భవతులకు, బాలింతలకు, వృద్ధులకు, బీపీ, సుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేయించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీలు పాల్గొన్నారు.


గుడిపాల: వైద్య సేవలందిస్తున్న డాక్టర్ సంధ్య

గర్భిణులపై ప్రత్యేక దృష్టి

గుడిపాల: గర్భిణులపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు స్థానిక ప్రాథమిక వైద్యాధికారి సంధ్య తెలిపారు. స్థానిక పీహెచ్‌సీలో ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం హైరిస్క్ గర్భిణులకు ఆరోగ్య పరీక్షలు చేశారు. ఆమె మాట్లాడుతూ గర్భిణులు తప్పనిసరిగా పోషకాహారంతో పాటు ఐరన్ మరియు క్యాల్షియం మాత్రలు వాడాలని, కాన్పు సేవలకు పీహెచ్‌సీలకు రావాలని తెలియజేశారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ బాల సూర్యనారాయణ, హెల్త్ సూపర్‌వైజర్ విజయ, ల్యాబ్ టెక్నీషియన్ వెంకటేష్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

బాల్య వివాహాలతో భవిష్యత్ నాశనం


కిల్లారిపల్లెలో బాలికలకు అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్లు

గుడిపాల: బాల్య వివాహాలతో చిన్నారుల భవిష్యత్ నాశనమవుతుందని అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు స్వర్ణలతాదేవి, తోయాద్రాక్షి అన్నారు. కిల్లారిపల్లె, పాపిశెట్టిపల్లె అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో కిశోర వికాసం కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ 11 ఏళ్ల నుంచి 18 ఏళ్లలోపు ఉన్న బాలికలను గుర్తించి వారికి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. సమాజంలో ఎదురయ్యే సామాజిక, లైంగిక సమస్యలను సమర్థవంతంగా ఎదుర్కోవాలని బాలికలకు సూచించారు. గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌లపై అవగాహన కల్పిస్తూ బాలికలు ఏదైనా సమస్యలు ఎదురైతే ధైర్యంగా ఎదుర్కోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు రాణి, గౌరి, నిర్మల, గౌతమి, యువశ్రీ పాల్గొన్నారు.

ఉద్యోగ సాధనకు ప్రణాళికతో చదవండి


డీఎస్సీ అభ్యర్థినికి మెటీరియల్ అందజేస్తున్న ఎమ్మెల్యే గురజాల

చిత్తూరు కలెక్టరేట్: డీఎస్సీ ఉద్యోగ సాధనకు ప్రణాళికతో చదవాలని చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ అన్నారు. నగరంలోని మిట్టూరులో ఉన్న కుట్టి స్టడీ సర్కిల్‌లో శుక్రవారం ఉచితంగా స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. దీనికి హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ డీఎస్సీకి సన్నద్ధం అవుతున్న అభ్యర్థులు సమయపాలన పాటిస్తూ శిక్షణ తీసుకుని పరీక్షలకు సిద్ధం కావాలన్నారు. అనంతరం శిక్షణ పొందుతున్న అభ్యర్థులకు ఉచితంగా శిక్షణా మెటీరియల్‌ను అందజేశారు. కార్యక్రమంలో మేయర్ అముద, చుడా చైర్‌పర్సన్ కఠారి హేమలత, రిటైర్డ్ డీవైఈవో చిట్టిబాబు, మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి చిన్నారెడ్డి, గిరిజన సంక్షేమ శాఖ అధికారి మూర్తి, మైనారిటీ కార్పొరేషన్ ఈడీ హరినాథరెడ్డి, కుట్టి కోచింగ్ సెంటర్ నిర్వాహకులు రామకృష్ణ, పవనకుమారి, డీఎస్సీ శిక్షణ పొందుతున్న అభ్యర్థులు పాల్గొన్నారు.

మండు వేసవిలో వృద్ధులకు జాగ్రత్తలు అవసరం



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ ప్రవీణ్‌కుమార్, అవగాహన కల్పిస్తున్న డాక్టర్ వైద్య సిబ్బంది

ఐరాల: ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో వృద్ధులు వడదెబ్బ బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ సూచించారు.మండలంలోని దివిటివారిపల్లెలో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో డాక్టర్ 70 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. డాక్టర్ మాట్లాడుతూ వేసవిలో ఎక్కువగా నీరు తాగాలని, ఎండలో తిరగకూడదన్నారు. వడదెబ్బ బాధితులకు అందించాల్సిన ప్రథమ చికిత్స గురించి వివరించారు. తలనొప్పి, తల తిరగడం, ఫిట్స్ వంటి లక్షణాలు ఉంటే వెంటనే సమీపంలోని వైద్యశాలకు తరలించాలని సూచించారు. మజ్జిగ, కొబ్బరి నీళ్లు తీసుకోవాలన్నారు.

బాల్య వివాహాల అనర్థాలపై అవగాహన

బాల్య వివాహాలపై బాలికలకు తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని వైద్యాధికారి ప్రవీణ్ కుమార్ అన్నారు. దివిటివారిపల్లెలో స్థానిక బాలికలకు బాల్య వివాహాలు, గుడ్ టచ్, బ్యాడ్ టచ్ వంటి వాటిపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ బాలికలకు అవగాహన లోపం వలన అనేక సమస్యలు తలెత్తే అవకాశం ఉందన్నారు. బాలికలు చదువుతో పాటు పరిశుభ్రత, పౌష్టికాహారంపై కూడా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఎప్పటికప్పుడు అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్య సిబ్బంది బాలికలకు అవగాహన కల్పించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.